క్లుప్తంగా

'పరకాల' బరిలో 'కొండా' అనుచరుడు



మాణిక్‌రావుతో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

పరకాల : పరకాల నుంచి ఎమ్మెల్యేగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అనుచరుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి బరిలో నిలవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ మేరకు ఆయన అధిష్టానానికి బుధవారం దరఖాస్తు చేసుకున్నాడు. మండలంలోని నాగారం సర్పంచ్ కట్కూరి స్రవంతి భర్త అయిన దేవేందర్‌రెడ్డికి కొండా మురళి ప్రధాన అనుచరుడు. ఆయన పలువురు నాయకులు, కార్యకర్తలను వెంట తీసుకుని హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని, తెలంగాణ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను బుధవారం కలిసి తనను పార్టీకి పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించాలని కోరారు.

ఉత్తమ పోలీస్ అధికారికి సన్మానం



కమలాపూర్ : ఇటీవల ఉత్తమ పోలీస్ అధికారిగా అవార్డు అందుకున్న స్థానిక ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్‌ను హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్‌గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త నూక సంపత్‌కుమార్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాలువాతో బుధవారం సత్కరించి ఘనంగా సన్మానించారు. ముున్ముందు మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



ఎల్కతుర్తి : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ కథనం ప్రకారం. ఇందిరానగర్‌కు చెందిన గంగారపు గట్టయ్య (65) పింఛన్ తీసుకునేందుకు ఎల్కతుర్తికి వెళ్లేందుకు బస్సు కోసం వేచి చూస్తుండగా ముల్కనూర్ నుంచి ఎల్కతుర్తి వైపు వస్తున్న ఓ లారీ అతివేగంగా అజాగ్రత్తంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన గట్టయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

ఎల్కతుర్తి : చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకి దింపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు తలపై పడి తీవ్ర గాయాల పాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన పెండ్యాల ఆనందం(48) మంగళవారం చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పలువురి సాయంతో కిందికి దింపుతుండగా అతడి తలకు బలమైన గాయమైంది. అతన్ని వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గాయపడ్డ వ్యక్తి..

పరకాల : రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. పరకాల సీఐ వెంకటరత్నం కథనం ప్రకారం.. రేగొండ మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన వల్స విజయ్‌కుమార్ (38) ఈనెల 20న పరకాలలో సామగ్రి కొనుగోలు చేసి తిరిగి వెళ్తుండగా పట్టణంలోని జాన్‌డీర్ ట్రాక్టర్ షోరూం వద్ద పంది అడ్డురావడంతో అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబీకులు హనుమకొండలోని ఆస్పత్రిలో చేర్చారు. కాగా విజయ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వెంకటరత్నం తెలిపారు.

విద్యార్థులకు షూ పంపిణీ

గీసుకొండ : మండలంలోని మనుగొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరియపురం సర్పంచ్, నిర్మల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ అల్లం బాలిరెడ్డి సొంత ఖర్చుతో బూట్లు, సాక్స్‌లను బుధవారం అందజేశారు. పేద విద్యార్థుల కోసం ఇంకా ఏమైనా సాయం అవసరం ఉంటే చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలిరెడ్డిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఎం ప్రసాద్, మందపల్లి పాఠశాల హెచ్‌ఎం రాంమూర్తి, ఎస్‌ఎంసీ చైర్మన్ నమిండ్ల రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట: చంద్రయాన్-3ను వీక్షిస్తున్న విద్యార్థులు



దామెరలో..



ఐనవోలులో..



చంద్రయాన్-3 సక్సెస్‌తో హర్షం

శాయంపేట : గత నెల 14న ఇస్రో శాస్త్రవేత్తలు శ్రీహరికోట నుంచి ఎల్‌వీఎమ్-ఎమ్ 4, చంద్రయాన్-3ని మోసుకుని నింగిలోకి దూసుకెళ్లిన వ్యోమనౌక చంద్రమామ దక్షిణ ధృవంపై సురక్షితంగా అడుగు పెట్టడం పట్ల సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి, మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం టీవీలో విద్యార్థులతో కలిసి చంద్రయాన్-3 చందమామ మీద అడుగు పెట్టడాన్ని వీక్షించారు.

దామెర : చంద్రయాన్-3 ల్యాండింగ్‌ను మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని మైనార్టీ స్కూల్ విద్యార్థులు టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వై.శ్రీలత మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చంద్రయాన్-3 ల్యాండర్ చంద్రుడిపై దిగుతున్న దృశ్యాలను వీక్షించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్, పొన్నాల రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న నన్నెబోయిన తిరుపతి

కమలాపూర్ : విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి విమర్శించారు. ఆ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అంబాల, శ్రీరాములపల్లి, గూడూరు, కమలాపూర్, శనిగరం గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులతో బుధవారం నిర్వహించిన సమావేశాలకు తిరుపతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. విద్యారంగానికి ఉమ్మడి రాష్ట్రంలోని బడ్జెట్‌లో 12 శాతం నిధులు కేటాయించగా తెలంగాణ ఏర్పాటు తర్వాత కేవలం 6 శాతం మాత్రమే కేటాయించారని, ప్రభుత్వ పాఠశాలలో 22 వేలకుపైగా ఉద్యోగ ఖాళీలున్నాయని చెప్పారు. ఎనిమిదేళ్లుగా ఉద్యోగోన్నతులు, ఆరేళ్లుగా బదిలీలు చేపట్టకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు కల్పించడంతోపాటు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, జూలై 31 నుంచి పీఆర్సీ ప్రకటించాలని, అప్పటివరకు ఐఆర్ చెల్లించాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశాల్లో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల రఘుపతి, సీనియర్ నాయకుడు పిల్లల జయప్రకాష్, మండల అధ్యక్షుడు చందుపట్ల రాజేంద్రం, జిల్లా బాధ్యులు చంద్రగిరి లక్ష్మయ్య, గొడిశాల రమేష్, అత్తె శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



దామెర : అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి కోరారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో బీఎల్‌ఓలతో మాట్లాడి గ్రామాల వారీగా ఓటర్ల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. 18 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతీఒక్కరిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ఓటరు లిస్టులో చేర్పులు, మార్పులు సైతం చేయించాలని చెప్పారు. మృతుల వివరాలు సేకరించి ఓటరు లిస్టు నుంచి తొలగించాలని తెలిపారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో డీటీ ఖురేషీ, ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ



దామెర : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దామెర కుమారస్వామి రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగిన క్రమంలో ఆయన్ను ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నగరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కాంక్షించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, రైతుబంధు మండల కోఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని రాజు తదితరులున్నారు.

నర్సక్కపల్లిలో..

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లికి చెందిన కొడపాక సరోజన, పూస్కూరి వీరక్క ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను తెలంగాణ రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో వరికెల కిషన్‌రావు, నాగుర్ల ధర్మారావు, నవత శివాజీ, శివరావు, శ్యామ్, వినయ్ పరామర్శించారు.

చెరువు మత్తడి మరమ్మతులో నిర్లక్ష్యం



మట్టి సంచులతో మరమ్మతు చేస్తున్న రైతులు

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలోని బంధం చెరువు మత్తడికి మరమ్మతు చేయించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఆయకట్టు రైతులు తెలిపారు. బంధం చెరువు మత్తడికి గ్రామానికి చెందిన రైతులు వలుగుల ప్రభాకర్, అనంతుల అశోక్, మోరె నాగరాజు, ఐలి వెంకటేశ్వర్లు, నరెడ్ల అఖిల్, లక్కర్సు కవిరాజు సొంత డబ్బుతో మట్టి సంచులతో బుధవారం మరమ్మతు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. మత్తడిపై లేయర్ ఏటా వర్షాకాలంలో ఊడిపోతుండడంతో చెరువులోని నీరు వృథా పోతున్న విషయాన్ని పలుమార్లు నీటిపారుదల శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. మత్తడి సరిగా ఉంటే వేసవిలో కూడా వేల ఎకరాల్లో పంటలు పండించవచ్చని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని చెరువు మత్తడికి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతు చేయించాలని రైతులు కోరుతున్నారు.

ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలి

ఆత్మకూరు : రాజకీయ పార్టీలు అసెంబ్లీ టికెట్ల కేటాయింపులో ముదిరాజ్ కులానికి చెందిన నాయకులకు సముచిత స్థానం కల్పించాలని స్థానిక మత్స్య శాఖ చైర్మన్ బయ్య తిరుపతి కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ టికెట్ల కేటాయింపులో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్ కులానికి స్థానం కల్పించకపోవడం దారుణమన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను విస్మరించే పార్టీల అడ్రస్‌లు గల్లంతవడం ఖాయమన్నారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు గుండెబోయిన భిక్షపతి, మెపా మండల ప్రధాన కార్యదర్శి బయ్య పైడి, ఉపాధ్యక్షుడు రవికుమార్, నాయకులు గుండెబోయిన శ్యామ్, బయ్య కుమారస్వామి, బయ్య నరేష్, మహేందర్, వంశీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 మోడల్ ప్రదర్శన

కమలాపూర్ : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే (ఎంజేపీ) స్కూల్‌లో చంద్రయాన్-3 మోడల్‌ను విద్యార్థులు బుధవారం ప్రదర్శించారు. చంద్రయాన్-3 రోవర్ లాండింగ్ సక్సెస్ కావాలని కాంక్షిస్తూనే అవగాహన కల్పించేలా చంద్రయాన్-3 మిసైల్ ల్యాండర్ రోవర్ మోడల్‌ను తయారు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఓదెల మల్లయ్య మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక విద్య పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. చంద్రయాన్-3తో దేశానికి ప్రపంచ స్థాయిలో కీర్తిప్రతిష్టలు ఇనుమడిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏటీపీ ఎస్.విజయ్, టీడబ్ల్యూ కె.రవి, రమేష్, దీప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి



శశాంక్ త్రివేదిని సన్మానిస్తున్న నాయకులు

- ఉత్తరప్రదేశ్ మొహలీ ఎమ్మెల్యే శశాంక్

ఎల్కతుర్తి : బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఉత్తరప్రదేశ్‌లోని మొహలీ నియోజకవర్గ ఎమ్మెల్యే శశాంక్ త్రివేది సూచించారు. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షులు కుడితాటి చిరంజీవి, పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో బుధవారం వేర్వేరుగా నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశాలకు శశాంక్ త్రివేది ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రెండు లక్షల ఇండ్లు మంజూరు చేస్తే అందులో ఒక్కటి కూడా పేదలకు అందించిన దాఖలాల్లేవన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలనకు చరమగీతం పాడేలా రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు శాయశక్తులా కృషి చేయాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతం చేయాలని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం నాయకులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మాచర్ల కుమార్, నాయకులు కంచర్ల శంకరయ్య, కిష్టయ్య, మధుసుధన్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

నడికూడ : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మచ్చ అనసూర్య అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. పలు శాఖల అధికారులు, కొందరు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కాలేదు. విద్యుత్, ఆరోగ్య, మిషన్ భగీరథ శాఖలకు సంబంధించిన సమస్యలపై మాత్రమే నామమాత్రంగా చర్చ జరిగింది. ఎలాంటి తీర్మానాలు లేకుండానే ముగించారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్య తీసుకోకపోతుండడంతోనే పలువురు తరచూ గైర్హాజరవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, జెడ్పీటీసీ కొడెపాక సుమలత, మాదారం సొసైటీ చైర్మన్ నల్లెల లింగమూర్తి, వైస్ ఎంపీపీ చంద కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనతో అవగాహన పెంపు



పశువుల అంగడిలో విద్యార్థులతో హెచ్‌ఎం

ఐనవోలు : క్షేత్ర పర్యటనతో విద్యార్థుల్లో అవగాహన పెరుగుతుందని స్థానిక ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పశువుల అంగడి(సంత)ని ఆ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. అంగడి నిర్వాహకులతో మాట్లాడి నిర్వహణ, కొనుగోళ్లు, అమ్మకాలు, వేలం, ఇతర అంశాల గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడారు. 4వ తరగతిలో ఉన్న అంగడి పాఠం అభ్యసనలో భాగంగా మండల కేంద్రంలోని పశువుల అంగడికి తీసుకెళ్లి అవగాహన కల్పించినట్టు తెలిపారు. క్షేత్ర పర్యటనల వల్ల విద్యార్థులకు ప్రత్యామ్నాయ విద్యా అవకాశాలు, సమాజ అవగాహన పెంపొందుతాయని చెప్పారు. విద్యావారధి అధ్యక్షుడు బీమళ్ల సారయ్య మాట్లాడుతూ క్షేత్ర పర్యటనతో అనేక ప్రయోజనాలున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

నిర్వాసితులకు 'డబుల్' ఇవ్వాలి

శాయంపేట : శాయంపేట, ఆత్మకూరు గ్రామాల మధ్య రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని, పేదలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

పేదలను ఆదుకునేందుకే సీఎంఆర్‌ఎఫ్

- పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డి



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే


ఆత్మకూరు : పేదలను ఆదుకునేలా రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ అందిస్తోందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. హనుమకొండలోని ఆయన నివాసంలో ఆ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 14 మందికి రూ.7 లక్షల 72 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు. పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, నాయకులు బొల్లోజు కుమారస్వామి, సావురే రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'చల్లా'కు శుభాకాంక్షల వెల్లువ

ఆత్మకూరు : పరకాల బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఆయనకు అధిష్టానం రానున్న ఎన్నికల టికెట్ కేటాయించిన నేపథ్యంలో హనుమకొండలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దామెర : ఎమ్మెల్యే ధర్మారెడ్డికి ముఖ్యమంత్రి కేసీఆర్ టికెట్ ప్రకటించడంతో ఆయన్ను మండల నాయకులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, ఊరుగొండ సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, ఓగ్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు దామెరుప్పుల శంకర్, దాడి మల్లయ్య, సిలువేరు నర్సయ్య, కూనాటి సునీల్‌రెడ్డి, జన్ను విద్యాసాగర్, రమేష్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే అరూరికి పలువురి అభినందన



ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను అభినందిస్తున్న శంకర్‌రెడ్డి, తదితరులు

ఐనవోలు : రానున్న ఎన్నికలకు సంబంధించిన బీఆర్‌ఎస్ టికెట్ ఖరారైన నేపథ్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలోని శ్రేణులు హనుమకొండలోని నివాసంలో ఎమ్మెల్యే రమేష్‌ను కలిసి అభినందనలు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ, అనుబంధ సంఘాల శ్రేణులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతుబంధు సమితి నాయకులు, ఆత్మ కమిటీ సభ్యులు, సొసైటీ సభ్యులు, ఇతర నాయకులు వేర్వేరుగా ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు.

వాహనదారులు క్షేమంగా గమ్యానికి చేరాలి

- పరకాల ప్రధాన న్యాయమూర్తి శాలిని లింగం



మాట్లాడుతున్న శాలిని లింగం

పరకాల : ప్రతీ పౌరుడు చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని.. క్షేమంగా గమ్యం చేరుకోవాలని పరకాల ప్రధాన న్యాయమూర్తి శాలిని లింగం అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పరకాల మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పరకాల ప్రధాన న్యాయమూర్తి శాలిని లింగం మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు పెరగడం ఆందోళనకరం అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపొద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల్ని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. అతి వేగంతో వాహనాలు నడిపి అమాయకుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారని, రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారికి చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని శాలిని హెచ్చరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్, ఏపీపీఓలు ఎ.కుమార్, కె.మధిర, ఆర్టీసీ డిపో మేనేజర్ రవీందర్, పరకాల, ఆత్మకూరు, శాయంపేట సీఐలు వెంకటరత్నం, రవి రాజు, మల్లేశం, ఆర్టీఏ, పోలీసు అధికారులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్‌ను విజయవంతం చేయాలి

దామెర : ఈనెల 26న నిర్వహించనున్న మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కాగితాల శంకర్ కోరారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారంలో సమాజంలోని ప్రతీఒక్కరు భాగస్వాములై గ్రామాలను హరిత వనాలుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో 750 నుంచి 950 మొక్కలు, మండలవ్యాప్తంగా 12,500 మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి, ఎంపీఓ నాగరాజు, ఏపీఓ శారద, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్, ఉప్పులపల్లి గ్రామాలకు చెందిన ఎలిగేటి నాగలక్ష్మీ, గాజుల కాంతమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ప్రముఖ పారిశ్రామిక వేత్త, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు స్వర్గం రవి పంపించిన రూ.5 వేల చొప్పున సాయాన్ని సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు బుధవారం అందజేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ బొల్లపెల్లి ఉమా రవీందర్, ఎంపీటీసీ అరుణ క్రాంతి, కోఆప్షన్ సభ్యుడు ఖాజా హసనొద్దీన్, మాజీ జెడ్పీటీసీ నవీన్‌కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జక్కుల రాజు, తదితరులు పాల్గొన్నారు.